# తొలి అక్షరం

తెలుగు దిన పత్రిక

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 14 పేజీలు - 6 ఆదివారం 08 డిసెంబర్ 2024


## భూదాన్ పోచంపల్లి రోడ్డు ప్రమాదం

● ఐదుగురు యువకులు జల సమాధి

**తొలిఅక్షరం/భువనగిరి, డిసెంబర్7:** చెరువులోకి కారు దూసుకెళ్లడంతో ఐదుగురు యువకులు మృతి చెందిన సంఘటన భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మరొకరు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికి తీశారు. మృతులను వంశీగౌడ్, దినేశ్, హర్ష, బాలు, వినయ్‌గౌడ్‌గా గుర్తించారు. వారంతా 22 నుంచి 25 ఏండ్ల మధ్య వయస్కులేనని వెల్లడించారు. ప్రమాద సమయంలో కారులో ఆరుగురు ఉన్నారని తెలిపారు. మణికంఠ అనే యువకుడు క్షేమంగా ఉన్నాడని పేర్కొన్నారు. వారంతా హైదరాబాద్ హయత్‌నగర్ ఆర్టీసీ కాలనీకి చెందినవారని తెలిపారు. ఎల్బీనగర్ నుంచి పోచంపల్లి వెళ్తుండగా జలాల్‌పూర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు వద్ద అదుపుతప్పిన కారు చెరువులోకి దూసుకెళ్లిందన్నారు.



## కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం...

● మా నాయకులు ఓడినా ప్రజల్లోనే ఉన్నారన్న సీఎం రేవంత్

**తొలి అక్షరం/నల్గొండ,డిసెంబర్7:** వరి వేస్తే.. ఉరేసుకున్నట్లేనని గతంలో కేసీఆర్ అన్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మా హయాంలో వరికి మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇస్తున్నాం. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అని నిరూపించాం. గతంలో ఎమ్మెల్యే లను లాక్కున్నా.. వెనకడుగు వేయకుండా పోరాడామన్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలో వైద్య కాలేజీ ప్రారంభోత్సవం, నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన చేసిన తర్వాత గంధం వారి గూడెంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమంలో నల్గొండ పాత్ర మరువలేనిది. ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న శ్రీకాంతచారి నల్గొండ వ్యక్తే. నల్గొండలో అడుగుపెట్టినప్పుడల్లా సాయుధ రైతాంగ పోరాటం గుర్తొస్తుంది. 15 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇస్తే.. అందులో నల్గొండ జిల్లాకు వేల ఉద్యోగాలు వచ్చాయన్నారు. నల్గొండలో కృష్ణా జలాలు ప్రవహిస్తే ఫ్లోరైడ్ సమస్య తీరుతుందని

వివరాలు 2లో

## ప్రధాని మోదీని హత్య చేస్తామని బెదిరింపులు

● అప్రమత్తమైన పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం



2లో

## తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు జరిమానా..



2లో

## ప్రజాపాలన దినోత్సవాలు

● 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

● కెసిఆర్‌ను ఆహ్వానించిన మంత్రి పొన్నం



**తొలిఅక్షరం/హైదరాబాద్,డిసెంబర్7:** తెలంగాణ రాష్ట్రంలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. 9న సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహా విష్కరణ కార్యక్రమానికి మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వానం అందింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానం అందజేశారు. ముందుగా సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్ హౌస్‌కు చేరుకుని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంత్రి పొన్నం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆహ్వాన పత్రిక

వివరాలు 2లో

## కాంగ్రెస్ పాలనపై అప్పుడే బోర్

● మళ్లీ అధికారం బీఆర్ఎస్‌కే ఓ సర్వే ప్రతినిధి వెల్లడి ● షార్ట్‌ఫిల్మ్ ప్రివ్యూ కార్యక్రమంలో మాజీ మంత్రి కేటీఆర్



**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్7:** కాంగ్రెస్ పాలనపై ప్రజలకు అప్పుడే బోర్ కొట్టిందని, మళ్లీ అధికారం కేసీఆర్‌కే దక్కుతుందని ఓ సర్వే ప్రతినిధి చెప్పినట్లు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నమ్మి నానబోస్తే షార్ట్ ఫిల్మ్ ప్రివ్యూ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఇవాళ నా వద్దకు ఓ సర్వే ప్రతినిధి వచ్చి.. ఈ ఏడాది పాలన గురించి విశ్లేషణాత్మకంగా చెప్పారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తే ఎలా ఉంటుందో చెప్పారు. ఆయన చెప్పిన మాట ఏంటంటే.. సహజంగా ఏ ప్రభుత్వం మీద అయినా మూడు, నాలుగేండ్ల తర్వాత కోపం వస్తది.. తెలంగాణ ప్రజలకు ఓపిక పట్టే గుణం ఉంది. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఏడాదిలోనే మనసు విరిగింది. కేసీఆర్ నాయకత్వంలో పోరాటాలు చేస్తున్నారో దీన్ని తప్పకుండా కొనసాగించండి.. అధికారం కేసీఆర్‌కు దక్కుతుందని చెప్పారని కేటీఆర్ తెలిపారు. గాంధీ భవన్ బోసిపోతోంది తెలంగాణ భవన్ నిత్యం కళకళలాడుతోంది.

వివరాలు 2లో

## తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుపై వివాదం

● రేవంత్ రెడ్డి చర్యను తీవ్రంగా ఖండిస్తున్నా

● డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టను ఆపాలి

● ప్రముఖ రచయిత జూలూరి గౌరీశంకర్

● హైకోర్టును ఆశ్రయించిన జూలూరి గౌరీశంకర్

● ప్రజల మనోభావాలు దెబ్బతింటాయని పిటిషన్

● విగ్రహ ప్రతిష్ట నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని వినతి

● హైకోర్టు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ!



**తొలిఅక్షరం/హైదరాబాద్,డిసెంబర్7:** తెలంగాణ తల్లి విగ్రహ వివాదం ముదురుతూనే ఉంది. బతుకమ్మ లేకుండా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై మేధావులు గళం విప్పుతున్నారు. రేవంత్ రెడ్డి చర్యను తీవ్రంగా ఖండిస్తున్నారు. నూతన తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై ప్రముఖ రచయిత జూలూరి గౌరీ శంకర్ హైకోర్టును ఆశ్రయించారు. డిసెంబర్ 9న సచివాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టను ఆపాలని పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులను తెలంగాణ ప్రజలు, మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విగ్రహంలో మార్పులు అంటే తెలంగాణ అస్తిత్వం జరుగుతున్న దాడిగా తెలంగాణ సమాజం భావిస్తుంది. తెలంగాణ తల్లి విగ్రహం రూపం మార్చడంతో రాష్ట్ర ప్రజల మనోభావాలు దెబ్బతింటాయని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ పిల్ ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈనెల 9న

వివరాలు 2లో

## మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

● ఏటా రూ. 20వేల కోట్ల వడ్డీలేని రుణాలు

● ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్7:** మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని... ఇందులో భాగంగానే ఏటా రూ. 20వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల మేర రుణాలు మహిళలకు ఇవ్వాలని నిర్దేశించుకున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పర్యాటక భవన్‌లో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి భట్టి విక్రమార్క ప్రారంభించారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు చెందిన ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లు పరిశీలించిన భట్టి..

వివరాలు 2లో



## మరో 15 ఏళ్లు మాదే అధికారం

● ఏడాది పాటు అద్భుతమైన పాలన

● రానున్న సంవత్సరాలకు ప్రణాళిక సిద్ధం

● తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్7:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంది. నేతలంతా విజయోత్సవాలు చేసుకున్నారు. ఈ క్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్. ఈ ఐదేళ్ళు కాదు.. రానున్న మరో పదేళ్లు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు.తెలంగాణలో ప్రభుత్వం కొలువు తీరి ఏడాది సందర్భంగామాట్లాడారు. ఏడాది పాటు అధ్బుతమైన పాలన అందించామన్నారు. రానున్న సంవత్సరాలకు ప్రణాళిక సిద్ధమైందన్నారు. వాటిని త్వరలో అమలు చేస్తామన్నారు. మా ప్రభుత్వానికి ఇప్పటికైతే ఐదుకి 4. 5 మార్కులు ప్రజలు ఇస్తున్నారని

వివరాలు 2లో

# ప్రజాపాలన దినోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈనెల 9న జరిగే కార్యక్రమానికి తప్పకుండా రావాలంటూ పిలిచారు. ప్రజాపాలన విజయోత్సవాలు, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భారాస అధినేత కేసీఆర్‌ను ఆహ్వానించింది. హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను, దిల్‌కుషా అతిథిగృహంలో కిషన్‌రెడ్డిని కలిసి ఉత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానపత్రాలు అందజేశారు. అనంతరం ఎర్రవెల్లికి వెళ్లి మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్‌ను ఆహ్వానించారు. మంత్రి వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ సలహాదారుడు హర్కర వేణుగోపాల్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ ఉన్నారు.

# కాంగ్రెస్ పాలనపై అప్పుడే బోర్

(మొదటి పేజీ తరువాయి)

లగచర్ల గిరిజన ఆడబిడ్డలు అందరూ వచ్చి తమ కుటుంబ సభ్యులను జైలు నుంచి విడిపించాలని కోరారు. వారి విడుదల కోసం లీగల్ సెల్ బృందం కష్టపడి న్యాయ పోరాటం చేస్తున్నారు. గిరిజన రైతులను బయటకు తీసుకొస్తామని ధైర్యం చెప్పాను. ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు కూడా ఫిర్యాదులు చేశాం. ఇక మా బకాయిలు ఇప్పించాలని మాజీ సర్పంచ్‌లు అడిగారు. ఆశా వర్కర్లు మా గురించి అసెంబ్లీలో మాట్లాడాలని కోరుతున్నారు. ఈ ఒక్కరోజే అందరూ తెలంగాణ భవన్‌కు వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారని కేటీఆర్ తెలిపారు. సూటిగా, సుత్తి లేకుండా సామాన్యుడికి అర్థమయ్యే విధంగా నమ్మి నానబోస్తే షార్ట్ ఫిల్మ్‌లో స్పష్టంగా చెప్పారు. గుండెకు తట్టే విధంగా చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు రగిలిపోతున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలను లేవనెత్తుతాం. ప్రజల తరపున ప్రభుత్వంపై తప్పకుండా పోరాటం చేస్తాం. మనకు అధికారం మాత్రమే పోయింది.. పోరాట యావ, చేవ పోలేదు. ప్రజల్లో అభిమానం ఏ మాత్రం తగ్గలేదు.. పెరిగింది అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

(మొదటి పేజీ తరువాయి)

అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. భవిష్యత్తులో అవి మధ్య, భారీ పరిశ్రమలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గ్రామీణ మహిళల్లోనూ వ్యాపారదక్షత ఉంటుందని.. పర్యావరణానికి హాని కలగకుండా చేసే ఉత్పత్తులను ఆదరించాలని భట్టి కోరారు.

# తెలంగాణకు మోదీ సర్కార్ ఏం చేసిందో చెప్పాలి

- గత ప్రభుత్వం అడగలేదనే నెపంతో దాట వేసే ధోరణి
- మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్7:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది అయిన సందర్భంగా ఓ వైపు ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తోంది. ఇదే సమయంలో పాలకపక్షం వైఫల్యాలపై బీజేపీ సరూర్ నగర్‌లో బహిరంగ సభకు ప్లాన్ చేసింది. ఈ క్రమంలో బీజేపీపై రుసరుసలాడారు మంత్రి పొన్నం ప్రభాకర్. చారిత్రాత్మక ప్రాంతం చార్మినార్ నుంచి బీజేపీపై పలు ప్రశ్నలు సంధించారు మంత్రి పొన్నం. గడిచిన 11 ఏళ్లలో తెలంగాణకు మోదీ సర్కార్, ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకి ఏమి ఇవ్వక పోగా, గత ప్రభుత్వం అడగలేదనే నెపంతో దాట వేసే ధోరణిని తప్పుబట్టారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మొన్న వరదలు వచ్చినప్పుడు నష్ట పరిహారం ఇవ్వకుండా తెలంగాణపై వివక్ష చూపలేదా అంటూ సూటిగా ప్రశ్నించారు. గతంలో ఆర్కియాలజీ– టూరిజం మంత్రిగావున్న కిషన్‌రెడ్డి మీ ముద్ర ఏది? హైదరాబాద్ నగరానికి ఏం చేశారనేది సరూర్ నగర్ సభలో చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ అంటే చెరువులకు కేరాఫ్ అని, దాన్ని బాగు చేసుకోవడం తమ బాధ్యతగా చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తమ ప్రభుత్వం కేంద్రాన్ని అన్నిరకాలుగా తెలంగాణకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కానీ ఎలాంటి చలనం లేదన్నారు. ముమ్మాటికీ తెలంగాణ ప్రయోజనాలకు నెరవేరుస్తున్నామని చెప్పుకొచ్చారు.



# కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం...

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు భావించారు.కేసీఆర్ పాలనలో నల్గొండ జిల్లా నిర్లక్ష్యానికి గురైంది. ఉమ్మడి పాలనలో కంటే కేసీఆర్ పాలనలోనే నల్గొండకు ఎక్కువ నష్టం జరిగింది. గతంలో ప్రారంభించిన ప్రాజెక్టులు కేసీఆర్ హయాంలో నిలిచిపోయాయి. ఈ జిల్లాలో కృష్ణా జలాలను ప్రవహింపజేయడం ద్వారా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి దేశానికే తలమానికంగా తీర్చిదిద్దుతామని సీఎం చెప్పారు. ఏడాదిలో ఏనాడైనా కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్ర పోషించారా? గెలిస్తే ఉప్పొంగిపోవడం.. ఓడితే కుంగిపోవడం. ఒక్కసారి ఓడిపోగానే కుంగిపోయి ఫామ్ హౌస్‌కు పోవడం కేసీఆర్ స్థాయికి తగదన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఓడిపోయినా ప్రజల్లో ఉండి ఎంపీగా గెలిచినట్లు సీఎం అన్నారు.మేం అధికారంలోకి వచ్చిన తర్వాత 8,500 ఐకేపీల ద్వారా రూ. 500 బోనస్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. 2.70 లక్షల ఎకరాల్లో సన్న వడ్లను నల్గొండ జిల్లా రైతులు పండించారు. మూడురోజుల్లో రైతులకు ధాన్యం అమ్మిన డబ్బులు చెల్లిస్తున్నాం. సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు వేస్తామన్నారు. సన్నాలు పండిస్తే రూ. 500 బోనస్ ఇస్తామని కాబట్టి రైతులు సన్నాలు పండించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. సన్నాలనే రేషన్ దుకాణాల్లో పంపిణీ చేస్తామని, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో సన్నాలనే భోజనానికి వినియోగిస్తామని సీఎం తెలిపారు. మూసీ వద్దని అడ్డంపడే వాళ్లకు ఘోరీ కట్టే శక్తి మీకున్నది. మూసీ ప్రక్షాళన చేయాలా? వద్దా? నల్గొండ ప్రజలు ఆలోచించాలన్నారు. ఎవరు అడ్డొచ్చినా మూసీ ప్రాజెక్టు పూర్తి చేసి తీరుతామని సీఎం అన్నారు.**నల్గొండను.. బంగారుకొండ చేయడమే మా లక్ష్యం...** మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మనకు ఇతర రాష్ట్రాలతో పోటీ కాదు.. ప్రపంచంతోనే పోటీ అన్నారు. రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేస్తామన్నారు. రూ. 300 కోట్ల నిర్మించిన వైద్య కళాశాలను ప్రారంభించామన్నారు. నల్గొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేస్తామన్నారు.

# ప్రధాని మోదీని హత్య చేస్తామని బెదిరింపులు

- అప్రమత్తమైన పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం

**తొలి అక్షరం/న్యూఢిల్లీ, డిసెంబర్7:** ప్రధాని నరేంద్ర మోదీని హత్య చేస్తామని ఒక బెదిరింపు సందేశం వాట్సాప్ ద్వారా ముంబై పోలీసులకు శనివారం అందింది. ట్రాఫిక్ పోలీస్ హెల్ప్ లైన్ కు పంపిన ఆ మెసేజ్ లో మోదీని లక్ష్యంగా చేసుకుని ఇద్దరు ఐఎస్ ఐ ఏజెంట్లు బాంబు పేలుళ్లకు కుట్ర పన్నినట్లు పేర్కొన్నారు. ఒక సీనియర్ రాజకీయ నాయకుడిని చంపేస్తామని ముంబై పోలీసులకు రెండు వారాల క్రితం కూడా ఒక మెసేజ్ వచ్చింది.ప్రధాని మోదీని హత్య చేస్తామని బెదిరిస్తూ సందేశం వచ్చిన నంబర్ రాజస్థాన్ లోని అజ్మీర్ లో ఉన్నట్లు గుర్తించామని, దుండగుడిని పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ప్రధాని మోదీ ని హత్య చేస్తామని బెదిరిస్తూ సందేశం పంపిన వ్యక్తి మానసిక రోగి అయి ఉండవచ్చని, లేదా మద్యం మత్తులో ఉండవచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది. పీఎం మోదీ ని హత్య చేస్తామని గతంలో ముంబై పోలీసులకు బెదిరింపు సందేశం వచ్చింది. గతవారం ముంబై పోలీసులకు ఒక అజ్ఞాత కాల్ వచ్చింది. ప్రధాని మోదీని చంపేయనున్నట్లు ఆ కాల్ చేసిన మహిళ హెచ్చరించింది. అనంతరం, ఆ 34 ఏళ్ల మహిళను పోలీసులు అదుపులోకి తీసుకుని, ఆమె నేపథ్యాన్ని పరిశీలిస్తున్నారు. గత బుధవారం ఉదయం 9.13 గంటలకు



ముంబై మెయిన్ పోలీస్ కంట్రోల్ రూమ్ కు ఓ మహిళ ఫోన్ చేసి పీఎం మోదీని చంపేందుకు కుట్ర పన్నారని, అందుకు ఆయుధం సిద్ధంగా ఉందని చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

# తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుపై వివాదం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిన రోజు, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ పుట్టినరోజు కావడంతో ఆ సందర్భాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలని నిర్ణయించింది. అచ్చమైన తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా మన తెలంగాణ తల్లి విగ్రహం ఉందని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కాగా, రాష్ట్ర సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ పండుగను సూచించే పాత విగ్రహాన్ని మార్చి, కాంగ్రెస్ తల్లి విగ్రహం పెడుతున్నట్లుగా ఉందని బీఆర్ఎస్ నేతలు మండిప డుతున్నారు. అచ్చమైన తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఉంది. అందులో మీరు ఈ లక్షణాలు గుర్తించాలి 1. తెలంగాణ ఆడబిడ్డల కట్టు, బొట్టు ఉట్టిపడేలా ప్రసన్న వదనంతో ఉండే నిండు రూపం. 2. చూడగానే తెలంగాణ తల్లి మన ఇంటి ఆడబిడ్డ అవతారం ఎత్తినట్లుగా కనిపించే ముఖం. 3. మెడలో బంగారు తీగ – ఎన్ని ఆభరణాలున్నా, తెలంగాణ ఆడబిడ్డలు మెడలో ఈ తీగను తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా, ఎంతో ఇష్టంగా ధరిస్తారు. 4. కుడి చేతితో తెలంగాణ ప్రజలకు అభయహస్తం చూపుతూ, ఎడమ చేతిలో తెలంగాణలో పండించే ముఖ్యమైన పంటలను ధరించి, రాష్ట్రంలో వ్యవసాయానికి గల ప్రాముఖ్యతను చాటి చెబుతుంది. తెలంగాణ గ్రామీణ జీవన విధాన ప్రాముఖ్యతను, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మూల స్తంభమైన వ్యవసాయంలో ఆడబిడ్డల ప్రాముఖ్యతను చాటుతోంది 6. వస్త్రధారణలోని ఆకుపచ్చని రంగు పచ్చని పంటలను, ఎరుపు రంగు చాకలి ఐలమ్మలాంటి తెలంగాణ ధీర వనితల పోరాటానికి సంకేతం. 7. తెలంగాణ తల్లిని బిడ్డలందరూ తమ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్నట్లుగా తెలిపే విగ్రహ పీఠం. 8. విగ్రహ పీఠంలో, తెలంగాణ తల్లికి దాస్య విముక్తి కల్పించిన తెలంగాణ బిడ్డల పోరాటాలకు ప్రతీకగా బిగిసిన పిడికిళ్లు. 9. రాష్ట్రంలోని సబ్బండ వర్గాలకు ప్రతిరూపంగా తెలంగాణ తల్లి విగ్రహం.

# మరో 15 ఏళ్లు మాదే అధికారం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు.ఈసారి గ్రేటర్‌లో కాంగ్రెస్‌దే హవా ఉండబోతోందన్నారు టీపీసీసీ. లోకల్ బాడీ ఎన్నికల్లో 80 సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్ళు కాదు రానున్న 10 నుంచి 15 ఏళ్లు సుస్థిరంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని నమ్ముతున్నామని మనసులోని మాట బయటపెట్టారు. విప్‌లు, ఎమ్మెల్సీలు, నామినేట్ పోస్ట్ విషయంలో సామాజిక న్యాయాన్ని పాటించామని తెలిపారు. ఉద్యమం నుంచి ఉద్భవించిన తెలంగాణకి ప్రతిరూపంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని వివరించారు. బతుకమ్మను తొలగించామని, దాన్ని వాళ్ళ పేటెంట్‌గా బీఆర్ఎస్ సీన్ చేసే ప్రయత్నం చేస్తోందన్నారు.వెలమ సామాజిక వర్గంపై షాద్ నగర్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను వ్యక్తిగతంగా చూస్తున్నామని, పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. కులం గురించి మతం గురించి వేరొక వ్యక్తి గురించి మాట్లాడటం ఎట్టి పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ సమర్థించదన్నారు. ముఖ్యమంత్రితో ఈ విషయంపై చర్చించి షాద్‌నగర్ ఎమ్మెల్యేను వివరణ ఇవ్వమని కోరామని, ఇవాళ లేదా రేపు గానీ సమాధానం ఇస్తారన్నారు. మంత్రి కొండా సురేఖ గతంలో నాగార్జున ఫ్యామిలీపై చేసిన వ్యాఖ్యలు వివరణ ఇచ్చారని, ఇలాంటివి భవిష్యత్తులో జరగకుండా గట్టిగా చర్యలు తీసుకుంటామన్నారు. దాదాపు అన్ని హామీలు పూర్తి చేశామని, త్వరలో మరికొన్ని హామీలు త్వరలోనే నెరవేర్చబోతున్నా మన్నారు. ప్రచారంలో ముందుకు వెళ్లే విధంగా కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశామన్నారు. ఏడాది పాలన హ్యాపీగా ఉందన్నారు తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్.

# తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు జరిమానా..



**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్7:**తెలంగాణ సర్కారుకు సుప్రీంకోర్టు రూ.లక్ష జరిమానా విధించింది. రెండు వారాల్లో ఆ జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఒకవేళ చెల్లించకపోతే రికవరీ కోసం కోర్టు రిజిస్ట్రీ తగిన నిర్ణయాలు తీసుకుంటుందని హెచ్చరించింది. విద్యార్థికి స్కాలర్ షిప్ చెల్లించడంలో నిర్లక్ష్యం వహించిన కారణంగా తెలంగాణ ప్రభుత్వానికి దేశ అత్యున్నత న్యాయస్థానం జరిమానా విధించింది.తెలంగాణకు చెందిన ఒక విద్యార్థి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి (ఏఓవీఎన్) స్కీం కింద స్కాలర్ షిప్ కోసం 2013లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్నాడు. అయితే విద్యార్థి తండ్రి ఏడాది ఆదాయం రూ.2 లక్షలు మించి ఉందన్న కారణంతో దరఖాస్తును తిరస్కరించారు. దీంతో విద్యార్థి తండ్రి గంటా వెంకట నరహరి హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై విచారణ అనంతరం పిటిషనర్‌కు రూ.10 లక్షల స్కాలర్ షిప్ ఇవ్వాలని 2023లో హైకోర్టు తీర్పు ఇచ్చింది. విద్యార్థి తండ్రి ఏడాది ఆదాయం ఎంతో మరోసారి తెలపాలని స్థానిక కలెక్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇదిలా ఉండగా పిటిషనర్ ఆదాయ వివరాలతో 161 రోజుల తర్వాత హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేసింది.ఆలస్యమైందన్న వాదనలతో ప్రభుత్వ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో ఈ ఏడాది అక్టోబర్ 19న రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్‌ను జస్టిస్ జేపీ పార్ధీ వాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడానికి 161 రోజుల ఆలస్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1 లక్ష జరిమానా విధించింది. ఈ విషయంలో హైకోర్టు హేతుబద్ధంగా ఇచ్చిన తీర్పులపై రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించవద్దన్న ఉద్దేశంతో ఈ జరిమానా విధిస్తున్నామని ఉత్తర్వుల్లో పేర్కొంది. రెండు వారాల్లో జరిమానా చెల్లించాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను బెంచ్ కొట్టివేసింది.

# కాంగ్రెస్ అంటేనే ఏమార్చడం

- పచ్చటి పొలాల్లో చిచ్చుపెడుతున్న రేవంత్
- ప్రజాపాలన కాదు.. నిర్బంధ పాలన : మాజీ మంత్రి హరీశ్‌రావు

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్7:** కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఏమార్చడం, మోసం చేయడమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నాడు ఫార్మా సిటీ అన్నారు, నేడు మాట మార్చి పచ్చటి పొలాల్లో చిచ్చు బెడుతున్నారని విమర్శించారు. గిరిజనుల బిడ్డలను జైళ్ల పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేంత్‌రెడ్డి.. మాట మార్చడమే మీ విధానమా? ప్రజలను మభ్య పెట్టడమే కాంగ్రెస్ పద్ధతా అని నిలదీశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ట్రిపుల్ ఆర్ బాధితులు, రైతులు హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా విషయంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని, ఎన్నికల తర్వాత మాట తప్పిన వైఖరిని ఆయనకు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు ఎవరూ తమ బాధను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట తప్పి, నిబంధనలకు విరుద్ధంగా సర్వేలు నిర్వహిస్తున్నారని, భూసేకరణ పత్రాలపై బలవంతంగా సంతకాలు పెట్టిస్తున్నారని బాధను వెలిబుచ్చారు. భూసేకరణ చట్టం అమలు చేయకుండా, తక్కువ ధరకే భూములు లాక్కునే కుట్ర చేస్తున్నారని వివరించారు. తమ సమస్య పట్ల ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీయాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు బాధితులకు ధైర్యం చెప్పారు. ఎన్నికల హామీలో చెప్పిన విధంగా కాంగ్రెస్ మాట నిలుపుకునే వరకు బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'ఉత్తర దిక్కు ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలని ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలను బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో బాధితులకు కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ చేత హామీ ఇప్పించి ఇప్పుడు మాట మార్చడం దుర్మార్గం. ఆర్ఆర్ఆర్ ఏర్పాటు విషయంలో ఉత్తర భాగంలో 40 కిలోమీటర్లకు బదులుగా 28 కిలో మీటర్లను పరిగణనలోకి తీసుకోవడం వల్ల చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పట్టణం మధ్య నుంచి రోడ్డు వెళ్లడంతో మున్సిపాలిటీ రెండు భాగాలుగా విడిపోతున్నది. బాధితులు రెండు పంటలు పండించే పచ్చని పొలాలను, ఇండ్లు, ప్లాట్లను కోల్పోతున్నా ప్రభుత్వం కనికరించడం లేదు. చౌటుప్పల్ వద్ద జంక్షన్ రింగు గతంలో 78 ఎకరాల్లో ఉంటే ఇప్పుడు 184 కు పెంచడం వల్ల పేదల భూములు, ప్లాట్లు కోల్పోతున్నారు. దీనికిగాను నష్టపరిహారం కూడా తక్కువ చెల్లిస్తున్నారు. ఎంపీగా ఉన్నపుడు కోమటి రెడ్డి.. బాధితులతో కలిసి ఆర్ఆర్ఆర్‌ను మార్చాలని, రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నాలు చేశారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంలోనూ అలైన్‌మెంట్ మార్చుతామని హామీలు ఇచ్చారు. కానీ, ఇప్పుడేమో అదే పోలీసు బలగాలతో, నిర్బంధంగా రోడ్డుకు 28 కిలోమీటర్ల పరిధిలోనే సర్వే చేయించి, ఒప్పంద పత్రాల మీద సంతకాలు పెట్టాలని బలవంత పెట్టడం దుర్మార్గం. రైతులను కాదని సర్వేలు నిర్వహించడం, వారిని భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఏమార్చడం, మోసం చేయడం. నాడు ఫార్మా సిటీ అన్నారు, నేడు మాట మార్చి పచ్చటి పొలాల్లో చిచ్చు బెడుతున్నారు. గిరిజనుల బిడ్డలను జైళ్ల పాలు చేశారు. నాడు ట్రిపుల్ ఆర్ రోడ్డు అలైన్మెంట్ మార్పు అన్నారు నేడు మాట మార్చి, నిర్బంధాల మధ్య భూసేకరణ కొనసాగిస్తున్నారు. రేవంత్ రెడ్డి.. మాట మార్చడమే మీ విధానమా? ప్రజలను మభ్య పెట్టడమే కాంగ్రెస్ పద్దతా?. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రియాంక గాంధీతో.. ఆర్ఆర్ఆర్ భూములు కోల్పోయిన రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పించారు. కానీ, అధికారంలోకి రాగానే బాధితుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తూ తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. వేధిస్తూ దాడులకు దిగుతున్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి హామీ అమలు చేయండి. లేదంటే బాధితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి





తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) డిసెంబర్ 07: తొర్రూర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, 1 వ వార్డ్ కౌన్సిలర్ బుసాని రాము ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఈ రోజు ఇంటికి రాగా వారిని పరామర్శించి, మనోధైర్యాన్ని అందించారు.అనంతరం తొర్రూర్ పట్టణంలోని మున్సిపల్ శానిటర్ అధికారి దేవేందర్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా శుక్రవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకొని ఆరోగ్యం పట్ల పలు సూచనలు చేసిన పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని ఝాన్సీ రెడ్డి.ఎమ్మెల్యే వెంట ముఖ్య నాయకులు,స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను పరిష్కరించటంలో కృషి చేస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న మధిర టౌన్ ఎస్ఐ - సంధ్య



తొలి అక్షరం/ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 7:మధిర పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న యువ ఎస్సై సంధ్య సమస్యలను పరిష్కరించటంలో తన మార్కు చూపిస్తూ ప్రజల యొక్క మన్ననలను పొందుతున్నారు, ఇటు ప్రజలకు అవసరమైన ఇసుక రవాణాలో ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకుంటూ, పట్టణంలో దొంగతనం జరిగిన వెంటనే దోషులను చట్టం ముందు నిలబెడుతూ, దొంగతనానికి గురి అయిన వస్తువులను బాధితులకు అందజేస్తూ తన ప్రతిభ చూపిస్తున్నారు. మధిర పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ట్రాఫిక్ సమస్యను తీర్చిదిద్దటంలో సఫలీకృతం అయ్యారు, పోలీస్ స్టేషన్కు వచ్చిన కేసులను సత్వరమే పరిష్కరిస్తున్న ఎస్సై సంధ్యని పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

## ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు



తొలిఅక్షరం/నెక్కొండ, డిసెంబర్ 7: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో కన్నుల పండువగా సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం అభిషేకాలు ముడుపులు కట్టే భక్తులతో కీటకిటలాడిన దేవాలయం నెక్కొండలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. ఆలయంలో కొలువు దిగిన శ్రీ నాగేంద్ర శ్రీవల్లి దేవసేన సమేత, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులకు ఉదయం నుంచి సర్ప సూక్త అభిషేకాలు జరిపారు. గణపతి పూజ చేసి పంచామృతాలతో మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు. భక్తులు వివాహం, సంతానం, ఆరోగ్యం, రుణ బాధలు, అన్యోన్య దాంపత్యం తదితర అంశాలపై పూజలు చేసి మొక్కులు చెల్లించి ముడుపులు కట్టారు. ఉదయం నుండి మధ్యాహ్నం దాకా కార్యక్రమం సాగింది. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ ఉత్సవం కన్నుల పండువగా సాగింది. ఆలయ అర్చకులు బివిఎన్ శాస్త్రి ఆధ్వర్యంలో వేద జ్యోతిష పండితులు శ్రవణ శాస్త్రి వరప్రసాద్ శర్మ, డింగరి శేష పవన్ కుమార్,ఆచార్యులు కళ్యాణ క్రతువు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, గుంటుపల్లి ప్రభాకర్ రావు, కొత్తకొండ గణేష్, విగ్రహ దాతలు బొల్లం పూర్ణ చందర్ రాధిక దంపతులు,శ్రీరామలింగేశ్వర సేవా సమితి సభ్యులు , మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సుబ్రహ్మణ్యస్వామి నామస్మరణతో ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది.

# గీత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

**● తొర్రూర్ మున్సిపాలిటీ ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా ● కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యం ● తొర్రూర్ మున్సిపాలిటీలోని అన్నీ వార్డులను అభివృద్ధి చేసేందుకు సాయశక్తుల కృషి చేస్తా ● నూతన గౌడ కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి**







తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) డిసెంబర్ 07: గీత కార్మికులను అన్ని విధాలుగా ఆదుకుంటాం అని పాలకుర్తి యశస్విని ఝాన్సీ రెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూర్ మున్సిపాలిటీలోని 10 వ వార్డులో టియుఎఫ్ఐడిసి నిధుల ద్వారా 15 లక్షల రూ, మంజూరైన, నూతన గౌడ కమ్యూనిటీ హాల్ భవనం పనుల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నీ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన.పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని ఝాన్సీ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ..కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొనడం సంతోషకరంగా ఉందని ఎమ్మెల్యే యశస్విని రేడ్డి పేర్కొన్నారు,కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యం,తొర్రూర్ మున్సిపాలిటీనీ ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా అని అన్నారు,మున్సిపాలిటీలోనీ అన్నీ వార్డులను అభివృద్ధి చేసేందుకు సాయశక్తుల కృషి చేస్తున్నానని, మున్సిపాలిటీ నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులను తీసుకోవచ్చి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేస్తారని తెలిపారు. గౌడ సంఘ అభివృద్ధికి ప్రభుత్వ%శీ% తరుపున సహాయ సహకారాలు అందిస్తామని,ఏ సమస్యలు ఉన్న తమ దృష్టిలో తీసుకురావాలని తెలిపారు.మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగు సురేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, మండల అధ్యక్షులు సంచు సంతోష్, సీనియర్ నాయకులు పెద్దగాని సోమన్న, గంజి విజయపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ బాపు రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రవణ్, అచ్చి రెడ్డి, దొంగరి శంకర్, వెంకటాచారి, పార్టీ ముఖ్య నాయకులు, గౌడ కులస్తులు, పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారు

**● గ్రావెల్ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి**







తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) డిసెంబర్ 07: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారాని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూర్ మున్సిపాలిటీలోని పదవ వార్డులో (టీయుఎఫ్ఐడిసి)నిధుల ద్వారా 15 లక్షల రూ, మంజూరైన, గ్రావెల్ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని టెంకాయ కొట్టి ప్రారంభించిన పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు యశస్విని ఝాన్సీ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ.రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ఇప్పటికే ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు,మున్సిపాలిటీలోనీ అని వార్డను అభివృద్ధి చేసేందుకు స్వయ శక్తుల కృషి చేస్తానని,నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు సరిగ్గా లేనట్లయితే లేదంటే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు, ప్రజా సమస్యల దృష్టిలో పెట్టుకొని సత్వర పరిష్కార%శీ%గా ముందుకు వెళు తున్నట్లు పేర్కొన్నారు,ఈ కార్యక్రమలో మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ జినుగు సురేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సోమ రాజశేఖర్, మండల అధ్యక్షులు సంచు సంతోష్, సీనియర్ నాయకులు పెద్దగాని సోమన్న, గంజి విజయపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ బాపు రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రవణ్, అచ్చి రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, దొంగరి రేవతి శంకర్, గజానంద్, వెంకటాచారి, కిషన్ యాదవ్, గుండాల నర్సయ్, సురేష్, పార్టీ ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

# సంక్రాంతి నాటికి మద్దులపల్లిలో మార్కెట్ నిర్మాణం పూర్తి

**● మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథబాబు ● పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ దయాకర్ రెడ్డి తో కలిసి పనుల పరిశీలన**



తొలి అక్షరం/ఖమ్మం బ్యూరో,డిసెంబర్ 7:సంక్రాంతి నాటికి ఖమ్మం రూరల్ మండలంలోని మద్దులపల్లి గ్రామ పరిధిలో వ్యవసాయ మార్కెట్ నిర్మాణం పూర్తవుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథబాబు పేర్కొన్నారు. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డితో కలిసి శనివారం మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంత్రి పొంగులేటి ఆదేశాలతో పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అత్యాధునిక హంగులతో, నాణ్యత ప్రమాణాలతో మార్కెట్ అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. మార్కెట్ శాఖ, ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణ పనులపై పూర్తి దృష్టిసారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు కల్లెం వెంకట్ రెడ్డి, అంబటి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

# అదిపత్య ప్రతిఘటన సామాజిక మాస పత్రిక అవిష్కరణ



తొలి అక్షరం/నెల్లికుదురు.డిసెంబర్ 7:ఆధిపత్య ప్రతిఘటన సామాజిక మాసపత్రిక ను కేవి పిఎస్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు ఆవిష్కరించారు.శనివారం నెల్లికుదురు మండల ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లో జరిగిన బహుజన చైతన్య వేదిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు గారు మాట్లాడుతూ బహుజనలంతా ఏకమై అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిపాలనలో రాజ్యాంగాన్ని మార్చి బహుజనులకు రావలసిన హక్కులను రాకుండా చేయడానికి కేంద్రంలో పరిపాలిస్తున్న ప్రభుత్వం కుట్ర పన్నుతుందని దాన్ని తిప్పి కొట్టాలంటే బహుజనలంతా ఏకమై భారత రాజ్యాంగాన్ని కాపాడాలంటే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల వారు కలిసి పోరాటమే లక్ష్యంగా ఎంచుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జిల్లా నాయకులు మందులు మహేందర్ ఇసంపల్లి సైదులు బాబుగౌడ్ తొట యాకయ్య అశోక్ , జెల్ల వెంకటేశ్,బాలాజీ నాయక్,తదితర బహుజన సామాజిక నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే మురళి నాయక్








తొలి అక్షరం/కేసముద్రం డిసెంబర్ 07: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం కేసముద్రం మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో ఇందిర మహిళ శక్తి క్యాంటీన్ షిరిడి సాయి డ్వాక్రా గ్రూప్ సభ్యురాలు జినుకల సునీతని నాగేశ్వరరావు, పింగిలి జ్యోతి, పింగిలి అలేఖ్య వీరికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇట్టి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను మహబూబాబాద్ శాసనసభ్యులు శ్రీ డాక్టర్ భూక్యా మురళీ నాయక్ ప్రారంభోత్సవం చేశారు.అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ మాట్లాడుతూ వివిధ గ్రామాల నుండి మార్కెట్కు సరుకులు తీసుకొస్తున్న రైతులకు నాణ్యమైనటువంటి భోజనాన్ని నందిగాలని నిర్వాహకురాలు అయినా జినుకల సునీత నాగేశ్వరావుకు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభ్యున్నతికి చేయూతనిస్తూ మహిళా మనలను, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేయడానికి, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు దోహదపడతాయని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం ఎంపీడీవో జై క్రాంతి కుమారి,మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు, బండారు వెంకన్న, బండారు దయాకర్, దస్రు నాయక్, కదిరే సురేందర్, వేముల శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ వసంతరావు, ఎండి అయుబ్ ఖాన్, చింతకుంట్ల యాదగిరి, నారాయణరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లం గణేష్, బానోత్ చిన్న వెంకన్న,మార్కెట్ ఏపీఎం రాజేందర్, వెంకటరమణ డ్వాక్రా గ్రూప్ సి ఏ లు, మార్కెట్ సెక్రటరీ,అధికారులు, మండల నాయకులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంతకు వెళ్లే పడమర రహదారిని ఏర్పాటు చేయండి

● మరిపెడ వామపక్ష పార్టీలు సిపిఐ సిపిఎం ఆధ్వర్యంలో వినతి

● వినతి పత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే జాటోత్ రామ డోర్నకల్ చంద్రునాయక్



తొలి అక్షరం/మరిపెడ: మహబూబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో ఆదివారము జరిగే సంత మరియు మోడల్ కూరగాయల మార్కెట్ జరుగుతుంది ఈ సంతకు మరిపెడ మండల ప్రజలే కాకుండా చుట్టుప్రక్కల పది మండలాల నుండి సంతకు మరియు మోడల్ కూరగా మోడల్ మార్కెట్ కు ప్రజలు తండోపతండాలుగా తరలి వస్తారు కాని ఈ మార్కెట్ కి మెయిన్ రోడ్ నుండి మాత్రమే రహదారి ఇవ్వటం జరిగింది. మరియు వాహనాలు ప్రజలు అన్నిటికి ఒకే రహదారి వలన ట్రాఫిక్ కి కూడా అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ జామ్ అవుతుంది దీని వలన ప్రజలు చాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది ట్రాఫిక్ సమస్య మరియు ప్రజలకు సమయం వృధా అవ్వడం తో పాటుగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఈ యొక్క మార్కెట్ కు వెసులుబాటు ఉన్న రహదారి ఎస్బిఐ రోడ్డు నుండి సంతకు పడమర వైపు కూడా రహదారి ఏర్పాటు చేయగలరని వినయ పూర్వకంగా మిమ్ములను వేడు వేడుకొనుచున్నాము ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు అబ్దుల్ రషీద్ సీపీఎం పార్టీ మండల నాయకులు రాజశేఖర్, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు

# వెలమ వివాదంపై షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్లారిటీ

● తప్పుగా భావిస్తే నా మాటలను ఉపసంహరించుకుంటున్నా.

● నియంతృత్వ ధోరణి అవలంబించే వారిని నేను విమర్శించాను

● వెలమలని ఉద్దేశించి అలా మాట్లాడలేదు

● నేను మాట్లాడిన మాటలను వెనుక ముందు కత్తిరించి పెట్టారు

● నేను ఒక శాసనసభ్యుడిని అందరినీ గౌరవిస్తా

● షాద్ నగర్‌లో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్



తొలి అక్షరం/షాద్ నగర్, డిసెంబర్ 07: వెలమలను దూషించారన్న వివాదంపై రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందించారు. తన మాటలు వెలమ జాతికి సంబంధించినవిగా భావిస్తే తన మాటలను ఉపసంహరించు కుంటున్నానని ఎమ్మెల్యే శంకర్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ..నేను మాట్లాడిన వ్యాఖ్యలు కేవలం కెసిఆర్ గారి కుటుంబ సభ్యులను ఉద్దేశించింది మాత్రమే తప్ప వెలమ కమ్యూనిటీ ని ఉద్దేశించింది కాదు. కెసిఆర్ మరియు వాళ్ళ కుటుంబ సభ్యులు రాష్ట్రాన్ని అప్పులు కుప్పలుగా మార్చారు అని చెప్పే క్రమంలో వారిని ఉద్దేశించి మాట్లాడటం జరిగింది. కానీ ఎవరిని కించపరచాలని గానీ వారి మనోభావాలను నొప్పించాలనే ఉద్దేశం నాకు లేదు. నేను ఒక పేదింటి బిడ్డను. అన్ని కమ్యూనిటీ ల సహకారంతో శాసన సభ్యుడిని అయ్యాను. అందరి సహకారం. ప్రేమ నాపై ఉంది. బి ఆర్ ఎస్ యూట్యూబ్ ఛానల్ వాళ్ళు కాంట్రవర్సీ క్రియేట్ చేయాలనే ఉద్దేశంతో ఆ విడియో లో ముందున్న మాటల్ని తొలగించి కేవలం వెలమలు అనే మాటలను వైరల్ చేశారు. నా మాటలు ద్వారా మీ మనసు నొప్పించి ఉంటె నా మాటలను వెనక్కి తీసుకుంటున్నాను.

# కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పని చేయండి

● విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రు నాయక్



తొలి అక్షరం/మరిపెడ, డిసెంబర్ 07: పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పని చేయండి అన్నారు ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్.ఇటీవల కాంగ్రెస్ జిల్లా పార్టీ ఆన్లైన్ పద్ధతిలో నిర్వహించిన యువజన విభాగం లో అత్యధిక ఓట్లు సాధించి జిల్లా, నియోజక వర్గ, మండల స్థాయిల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవుల్లో నియమితులైన యువజన విభాగం నాయకులుజిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ నాయక్, మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ యూత్ వైస్ ప్రెసిడెంట్ జాటోత్ సురేష్ నాయక్ ల ఆధ్వర్యంలో ఈ రోజు మరిపెడ మండల కేంద్రంలోని ఆర్ %డ%బి గెస్ట్ హౌస్ లో ఆయనను మర్యాద పూర్వకంగా కలసి పూల బొకే అందించి శాలువాతో సత్కరించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే యువజన నాయకులను అభినందించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ మీపై ఎంతో నమ్మకంతో మీకు ఓటు వేశారు, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందరిని కలుపుకు పోతు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వంటికొమ్ము యుగంధర్ రెడ్డి, మండల అధ్యక్షులు పెండ్లి రఘు వీరా రెడ్డి, మరిపెడ పట్టణ అధ్యక్షులు షేక్ తాజుద్దీన్, గంధసిరి అంబరీష,పానుగోత్ రాంలాల్,మైనార్టీ నాయకులు షేక్ అఫ్జల్, ఎండీ ఆఫ్సర్, ఎండీ అజీజ్,కారంపూడి ఉపేందర్,దేవరశెట్టి లక్ష్మీనారాయణ,భాషిపంగు రవికాంత్,తదితరులు పాల్గొన్నారు

# తాటిపెల్లి శివ కుమార్ కుమార్తె నిశ్చితార్థానికి హాజరైన బంధు లక్ష్మణ్



తొలిఅక్షరం/నెక్కొండ, డిసెంబర్ 7: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త తాటిపల్లి శివకుమార్ కుమార్తె నిశ్చితార్థానికి హాజరైన నెక్కొండ మండల మండల ప్రముఖ పారిశ్రామికవేత్త బంధు లక్ష్మణ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వ దించడం జరిగింది ,కరీంనగర్ రోడ్ నయీమ్ నగర్ ప్రెసిడెంట్ దాబాలో జరిగిన నిశ్చితార్థ కార్యక్రమంలో తాటిపెల్లి శివకుమార్-సురేఖ దంపతుల కూతురు శ్వేత-అరవింద్, నిశ్చితార్థానికి హాజరై వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసిన బంధు లక్ష్మణ్ దంపతులు.

# రాజ్యాంగంపై జరిగే కుట్రలను తిప్పికొట్టాలి..!!

● కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. టి. స్కైలాబ్ బాబు తెలంగాణ ..

● ప్రతి భారతీయుడు రాజ్యాంగం చదవాలి..

● బహుజన చైతన్య వేదికలో వక్తల అభిప్రాయం..



తొలి అక్షరం/నెల్లికుదురు,డిసెంబర్ 07: రాజ్యాంగాన్ని మార్చాలనే దురభిప్రాయంను ప్రతి భారతీయుడు తిప్పికొట్టవలసిన ఆసన్నం మొదలైందని కే వి పీ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు పిలుపు నిచ్చారు.శని వారం బి ఆర్ అంబేద్కర్ 68 వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక జి జే సి కళాశాలలో జరిగిన ఎస్సీ ఎస్టి బీసీ మైనార్టీ ఆద్వర్యంలో బహుజన చైతన్య వేదికలో పాల్గొన్న విద్యార్థి ,అధికారులు గ్రృజా ప్రతినిధులువివిధ కుల సంఘాల నాయకులు ఉద్దేశించి రాజ్యాంగం విలువలపై ప్రధాన వక్తగా స్కెలాబ్ బాబు పాల్గొని మాట్లాడుతూ. ఈరాజ్యాంగాన్ని ఇప్పుడు ఉంచాలా? తుంచేయ్యలా ?కేంద్రంలో కుట్రలు పన్ని ఆలోచిస్తున్నారని, ఆలోచన కాదు ఒక అదుగు ముందుకేసి అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పనికిరాదు తాగిన భారత రాజ్యాంగం మన సంస్కృతి అని ప్రకటించారు. కృష్ణారెడ్డి అనే ఆర్ఎస్ఎస్ నాయకుడు ఒక గ్రంథాన్ని వ్రాసి దాని ఆవిష్కరించడానికి ప్రయత్నించారు రాజ్యాంగం రద్దుచేసి మన సంస్కృతి దేశ పవిత్ర రాజ్యాంగ మార్చాలని చూస్తున్నారు ఈ కుట్రలను ప్రతి భారతీయుడు తిప్పుకోట వలసిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై ప్రతి ఒక్కరు ఆలోచించవలసిన అవసరం ఆసన్నమైందన్నారు. 448 ఆర్టికల్స్ 25 భాగాలు 12 షెడ్యూలు కలిగి ఉన్నది ఈ రాజ్యాంగాన్ని ఇప్పటికే 106 సార్లు సవరించారు రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కల్పించింది ఈ రాజ్యాంగాన్ని మార్చడానికి ఎవరికీ వీలు లేదు. సవరించడానికి అవకాశం ఉంది. ప్రజల చేత ప్రజల కొరకు ప్రజా వలన ప్రజల వలన ఎన్నుకునే ప్రజాస్వామ్యం ప్రజల కోసం కాకుండా కార్పొరేట్లకు కాపలాగా మారుతుంది అనే ఆందోళన వ్యక్తం చేశారు. ఓటును ఒక సరుకుగా మార్చారు కోట్లు పెట్టి ఓట్లు కొంటున్నారు ఓటు హక్కు కల్పిస్తూ అంబేద్కర్ మాట్లాడిన మాటలు మనం గుర్తు చేసుకోవాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంబేద్కర్ మాట్లాడిన మాటలు ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది ఒక ఓటు ఒక ఓటుకు ఒకే విలువ, కేవలం రాజకీయ సమానత్వం మాత్రమే సాధిస్తుంది కానీ ఆర్థిక సామాజిక అంతరాలను దేశాన్ని ఏలబోయే పాలకులు సాధించాల్సి ఉంటుందని అన్నారు. 77 ఏళ్ల కాలంలో ఆర్థిక అంతరాలు అందనంత దూరంలో పెరిగాయి దేశంలో 169 శతకోటీశ్వరుల చేతుల్లో జేసి సంపద 40 శాతం పోగు పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. **చట్టం ముందు అందరూ సమానులే: ఎస్సై రమేష్ బాబు..**బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ నిబంధన ప్రకారం చట్టం ముందు అందరు సమానులే అని స్థానిక ఎస్సై రమేష్ బాబు అన్నారు. కుల మత భాష లేకుండా మనుషులంతా సమానమేనని చాటిచెప్పిన గొప్ప రాజ్యాంగం మనది అని స్థానిక ఎస్సై రమేష్ బాబు అన్నారు. బహుజన చైతన్య వేదిక సందర్భంలో బి ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని రమేష్ బాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగం 1949 సంవత్సరం నవంబర్ 26వ తేదీన భారత ప్రజలమైన మేము మా భారత్ రాజ్యాంగాన్ని మాకు మేమే రూపొందించుకొని మాకు మేమే సమర్పించుకుంటున్నామని ప్రకటించుకున్న సందర్భంగా భారతదేశంలో వాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్రంగా ప్రకటించుకోవడం జరిగిందని భారత రాజ్యాంగం భారత ప్రజలందరికీ సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని ఆలోచన స్వేచ్ఛ భావ ప్రకటన స్వేచ్ఛ నమ్మకాన్ని విశ్వాసాన్ని కలిగి ఉండే ఆరాధన స్వేచ్ఛ సమాన హొదా సమాన అవకాశాలు కల్పించే విధంగా ప్రకటించడం జరిగిందన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 చట్టం ముందు అందరూ సమానులేనని ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కొడిచింతల రాజు, ఎంపీఓ పద్మ , జి జెసి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు,హెచ్ ఎం రవి.బహుజన చైతన్య నాయకులు వైస్ ఎంపిపి జెల్ల వెంకటేశ్,సిపిఎం మండల కార్యదర్శి సైదులు.బీసీ రాజ్యాధికార సమితి మండల అధ్యక్షులు వరిపెల్లి ఉప్పలయ్య .బాలాజీ నాయక్,మాదరి ప్రశాంత్, మౌ నేందర్, బాబు గౌడ్.రహిమాన్ దాసరి ప్రకాష్,యాదగిరి

# అమీనాపురం గ్రామంలో సీఎం కప్ క్రీడలు ప్రారంభించిన ఎమ్మెల్యే

● నాయకులతో కబడ్డీ ఆడిన ఎమ్మెల్యే డా మురళి నాయక్







తొలి అక్షరం/కేసముద్రం డిసెంబర్ 07: అమీనాపురం గ్రామంలో ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాలు భాగంగా సీఎం కప్ గ్రామీణ స్థాయి క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7 నుండి జనవరి 2 వరకు సీఎం కప్ క్రీడోత్సవాలు ( సీఎం కప్ 2024) జరుగనున్నాయి.అని తెలియజేశారు..గ్రామీణ స్థాయిలో క్రీడా ప్రతిభను గుర్తించి, ప్రోత్సాహం కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డా.మురళీ నాయక్ తెలిపారు.. ఈ క్రీడోత్సవాలు 36 ఈవెంట్స్లో మూడు దశల్లో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.. ఈ నెల 7, 8 తేదీలలో గ్రామ పంచాయితీ స్థాయిలో క్రీడా పోటీలు జరుగనున్నాయి. కాగా.. ఈ నెల 7, 8 తేదీల లోపు ఆన్లైన్..సీఎంకప్ 2024.తెలంగాణ .గవర్నమెంట్ .ఇన్.లో పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎమ్మెల్యే క్రీడాకారులకు విజ్ఞప్తి చేశారు..శనివారం నుంచి ప్రారంభం కానున్న ఆన్లైన్ ప్రక్రియలో ఉత్సాహంగా గ్రామీణ క్రీడాకారులు తమ సమాచారాన్ని పొందుపరుచాలని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తెలిపింది.. 7, 8వ తేదీల్లో మొదటగా గ్రామ స్థాయిలో పోటీలు, 10%-%12వ తేదీల్లో మండల స్థాయి పోటీలు,16%-%21 తేదీల్లో జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. అయితే.. పోటీలలో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు తన సమాచారాన్ని ఆన్లైన్లో పొందుపరిచేలా వెబ్సైట్, మొబైల్ యాప్ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి,డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి,మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, ఎంపీడీవో జె క్రాంతి కుమారి,మాజీ జెడ్పిటిసి బండారు వెంకన్న, పీసీసీ సభ్యులు దాస్రు నాయక్, బండారు దయాకర్, అమీనాపురం గ్రామ అధ్యక్షులు,జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించిన పీసీసీ సభ్యులు రంజిత్ రెడ్డి



తొలిఅక్షరం/నెక్కొండ, డిసెంబర్ 7: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన తాటి పెల్లి శివకుమార్ కుమార్తె నిశ్చితార్ధ కార్యక్రమానికి హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించిన పిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపల్లి దేవేంద్రరావు, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, నెక్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, మాజీ ఎంపీపీ ఆవుల చంద్రయ్య, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి,దొడ్డ విజయ్, మండల కాంగ్రెస్ నాయకులు కుసుమ చెన్నకేశవులు, కేవీ సుబ్బారెడ్డి, మెట్టు నరసింహారెడ్డి, గుంటుపల్లి ప్రభాకర్ రావు, ఆవుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తాటిపెల్లి శివకుమార్ కుమార్తె నిశ్చితార్థానికి హాజరైన పెద్ది స్వప్న- సుదర్శన్ రెడ్డి



తొలిఅక్షరం/నెక్కొండ, డిసెంబర్ 7:వరంగల్ జిల్లా నెక్కొండ మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాటిపెల్లి శివకుమార్, సురేఖ, దంపతుల కుమార్తె శ్వేత, అరవింద్, నిశ్చితార్థ సందర్భంగా హనుమకొండలోని నయీమ్ నగర్ ప్రెసిడెంట్ కన్వెన్షన్ హాల్ కి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసిన. నర్సంపేట నియోజకవర్గ మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి, నెక్కొండ పిఎసిఎస్ చైర్మన్ మారం రాము, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సంగని సూరయ్య, అడ్వకేట్ కొమ్ము రమేష్ యాదవ్, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దేవనబోయిన వీరభద్రయ్య, సీనియర్ నాయకులు కారింగుల సురేష్, రామాలయ కమిటీ మాజీ చైర్మన్ పోడిశెట్టి సత్యం, గురుకులాల రాష్ట్ర సలహాదారులు గడ్డం రమేష్, నెక్కొండ పట్టణ యూత్ అధ్యక్షులు బొడ్డుపల్లి రాజు, యూత్ నాయకులు ఈదునూరి శ్రీనాథ్, వద్దూరి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



తొలి అక్షరం/నరసింహుల పేట,7 డిసెంబర్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రం ప్రభుత్వ హైస్కూల్లో సీఎం కప్ క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. అనంతరం ఈ క్రీడా ఉత్సవాలకు హాజరైన ప్రముఖులు మండల ఇన్చార్జి ఎంఈఓ మండల గ్రామ పంచాయతీ కార్యదర్శిమాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని,ఉత్తేజాన్ని,శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతోపాటు, గ్రామస్థాయి యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని జిల్లా, రాష్ట్ర,జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి ఈ క్రీడ పోటీలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ శ్రీనివాస్ ఉపాధ్యాయులు. ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం మండల కేంద్రంలోని అన్ని మండలాలు కు 8 9 10 తేదీలలో అన్ని గ్రామాలకు సీఎం కప్ క్రీడ పోటీలకు ప్రారంభం అవుతాయనిఈ అవకాశం తీసుకోవాలని మండల ప్రజలను కోరారు పంచాయతీ కార్యదర్శి కోరారు



# ప్రమాదాలకు అడ్డగా మారిన ఇనుప సామాన్ దుకాణంపై తక్షణమే చర్య తీసుకోవాలనీ మున్సిపల్ కమిషనర్‌కు లేఖ

- రోడ్డు మరమ్మతులు తక్షణమే ప్రారంభించి ప్రమాదాలను నివారించాలి: బీఎస్పీపార్టీ నేత బుర్రి సాగర్..





**తొలిఅక్షరం/డిసెంబర్ 7( నర్సంపేట):** బహుజన్ సమాజ్ పార్టీ వరంగల్ జిల్లా నర్సంపేట తనుగుల రామచంద్రు నర్సంపేట మండల అధ్యక్షుడు బిఎస్పి ఆధ్వర్యంలో నియోజకవర్గం మున్సిపాలిటీ కేంద్రమైన నర్సంపేట నుండి నల్లబెల్లి వరకు వివిధ గ్రామాలను కలుపుతూ వెళ్లే మాదన్నపేట రోడ్డు ఇరుకుగా ఎన్స్పెసార్డు సాంక్షన్ ఆయన పట్టించుకోని ప్రభుత్వాలు అనేక యాక్సిడెంట్లు అవుతున్న కూడా పట్టించుకోని ప్రభుత్వం దీనికి తోడుగా ఇనుప సామాను దుకాణం వ్యాపారి రోడ్డును కాస్త ఆక్రమించుకుంటూ వస్తున్నారు ఇలాంటి కారణంగా రోజు ఏదో ఒక ప్రమాదం జరుగుతుంది తక్షణమే దీనిపైన చర్య తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ నర్సంపేట నియోజకవర్గం అధ్యక్షులు బుర్రి సాగర్ మున్సిపల్ కమిషన్ ని కోరారు అదేవిధంగా ప్రభుత్వం దీనిపైన చర్య తీసుకొని వెంటనే మరమ్మతులు రోడ్డు వెడల్పు మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమం లో తనుగుల శ్రీకాంత్ నర్సంపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గొర్రె రామస్వామి బీఎస్పీ నాయకులు జిలకల యాకయ్య ముదిరాజ్ బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్యదర్శి జాడ ఎక్కడ...?

- మా ఊరు సమస్యలు పట్టించుకునే నాధుడు ఎవరు
- అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని గ్రామ ప్రజలు విన్నపం





**తొలి అక్షరం/నర్సింహులపేట డిసెంబర్ 7:** మండలంలోని కౌసల్యాదేవిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఓపెన్ వెల్ (మంచినీటి బావి) నుండి గ్రామానికి మంచినీటి సరఫరా జరిగే ప్రధాన పైపులైన్ గత మూడు సంవత్సరాలుగా లీకేజీ పట్టించుకోని అధికారులు ప్రజా ప్రతినిధులుపైప్ లైన్ లీకేజ్ అవ్వడం వలన గుంతలు ఏర్పడి మురుగు నీటిలో పేరుకుపోయిన చెత్త,ముళ్ల కంపలు పిచ్చి మొక్కలు, వ్యాపిస్తున్న దోమలు పైప్ లైన్ లీకేజీ చేయకుండా,దారికి అడ్డంగా ముళ్ళకంప ఏర్పాటు చేసిన వైనం రైతులు పంట పొలాలకు వెళ్లే దారిలో ముళ్ళకంచే వెయ్యడంతో ఇబ్బందులు పడుతున్న రైతులు గత ప్రభుత్వంలో పట్టించుకోని ప్రజా ప్రతినిధులు,అధికారులుప్రస్తుతం గ్రామంలో ఉన్న సమస్యలు చెప్పుకుందాం అన్నా కూడా గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ఎవరో కూడా తెలియని పరిస్థితి అని, ఆ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్ లైన్ మరమ్మతులు చేపించాలని గ్రామస్తులు, రైతులు డిమాండ్ చేస్తున్నారులేనియెడల మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాలు నిరసన కార్యక్రమాలు చేస్తామని ఆ గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు.మా గ్రామానికి పంచాయతీ కార్యదర్శులు నియమించాలని గ్రామ ప్రజలు కోరారు

# సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

- ఆరు గ్యారంటీ పథకాలకు మాటకు కట్టుబడి ఉన్నం
- వడ్లకు క్వింటాకు రూ.500లు బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే: ఎమ్మెల్యే కోరం కనకయ్య



**తొలి అక్షరం/బయ్యారం,డిసెంబర్7:** బయ్యారం మండలం పరిధిలోని జరిగిన ప్రజా పాలన వారోత్సవాల సందర్భంగా కోటగడ్డ, అల్లిగూడెం, కంబాలపల్లి, నారాయణపురం, భీమ్లా తండా, కొత్తగూడెం, కొయ్యగూడెం, జగత్రావుపేట, బీరువాలమడుగు గంధంపల్లి,కొత్తపేట, గ్రామపంచాయతీలలో మిగిలి ఉన్న దుబ్బరోళ్ల సైతం ఏ ఒక్కటి కూడా ఉండకూడదు అని ఎమ్మెల్యే కోరం, కనకయ్య ప్రతి ఈ గ్రామ పంచాయతీని సందర్శించి ఆ గ్రామపంచాయతీ లో సి సి రోడ్లకు శంకుస్థాపనలు అలాగే గ్రామపంచాయతీ బిల్డింగులు, అంగన్వాడి కేంద్రాలకు, వడ్ల కొనుగోలు కేంద్రాలను శంకుస్థాపన కోటి రూపాయల పై చిలుకు చేసి కొత్తపేట జెడ్పిపిఎస్ హైస్కూల్లో సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎవరు కూడా రైతుల బాధలు అర్థం చేసుకొని వడ్లకు బోనస్ ఇచ్చిన ప్రభుత్వాలు లేవని,కానీ, ఏదైతే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల ఇచ్చిన మాట తప్పకుండా మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం అది,కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం అని ,అలాగే వడ్లకు క్వింటాలకు 500 రూపాయలు బోనస్ ఇచ్చిన ఘనత అది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని, అలాగే గత ప్రభుత్వం ఎలాంటి డీఎస్సీ నోటిఫికేషన్లు ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడారు కానీ, మధ్యతరగతి పేద విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ ఫీజులు, రూమ్ రెంట్లు కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్న క్రమంలోనే డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చి,రెండు నెలల కాలంలోనే ఉత్తీర్ణత సాధించినటువంటి,వారికీ పత్రాలు ఇచ్చి ఉద్యోగానికి పంపించిన ఘనత అది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే దక్కిందని అలాగే గంధంపల్లి, కొత్తపేట ఆటో యూనియన్ సభ్యులు మొత్తం కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవ్వడం జరిగిందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలోని భూక్యా,ప్రవీణ్ నాయక్, చాగ చాగర్ల ముడి భాస్కర్,గడ్డం సురేష్, మూల మధుకర్ రెడ్డి, రాంబాబు, రవి, చల్లా సురేష్,ఎంపీడీవో, ఏవో , జెడ్పిహెచ్ఎస్ హైస్కూల్ హెచ్ఎం, ఎంఈఓ , వాటర్ ఇరిగేషన్ ఏయిలు, మండల నాయకులు గ్రామ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు



# ఫరూక్ నగర్‌లో గంపా నాగేశ్వరరావు మోటివేషన్ క్లాస్

- మోటివేషన్ క్లాస్‌కు హాజరైన విట్యాలలో ఉన్నత పాఠశాల విద్యార్థులు
- సమయం సద్వినియోగం చేసుకుంటే విద్యార్థులు ఎంతో ఎత్తుకు ఎదుగుతారు
- సెల్ఫోన్లను ఎంత మేరకు వాడాలో అంతవరకే వాడాలి
- మోటివేషన్ క్లాస్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది
- విట్యాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆవుల రవి



**తొలి అక్షరం/ఫరూక్ నగర్, డిసెంబర్07:** ఫరూక్ నగర్ మండలంలో జరిగిన మోటివేషన్ క్లాస్ కు విట్యాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆవుల రవి, ఉపాధ్యాయులు మల్లికార్జున శర్మ, వెంకటరమణ, రమేష్ విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విట్యాల ప్రధానోపాధ్యాయులు ఆవుల రవి మాట్లాడుతూ 8, 9 వ తరగతి విద్యార్థులకు డాక్టర్ గంపా నాగేశ్వరరావు మోటివేషన్ క్లాస్ నిర్వహించడం ఉపయోగకరమైనదని, పదవ తరగతి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, మన దగ్గర ఉన్న ఫోను ఎలా ఉపయోగించాలి, సమయాన్ని ఎలా సద్వినియోగపరచుకోవాలో మోటివేషన్ క్లాసులో గంపా నాగేశ్వరరావు పూర్తిగా వివరించారన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆవుల రవి మాట్లాడుతూ ఒక మనిషి ఒక జీవితాన్ని సమూలంగా మార్చే శక్తి కేవలం చదువుకు మాత్రమే ఉందని, కాబట్టి ప్రతి వ్యక్తి చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థి దశలో తల్లిదండ్రుల యొక్క కష్టాన్ని గుర్తించి ఉపాధ్యాయుల యొక్క ప్రత్యేకమైన కృషిని గుర్తించి, ఒక విద్యార్థి జీవితంలో పైకి రావాలి అంటే పాఠశాల స్థాయి నుంచి పెద్దలపట్ల గౌరవాన్ని కలిగి ఉండడం, పిల్లల పట్ల ప్రేమ కలిగి ఉండడం, ప్రకృతిని సంరక్షించడం, మొక్కై వంగనిది మానై వంగదు, విలువతో కూడిన విద్య నేర్చుకుంటూ ఈనాటి బాలలే రేపటి పౌరులు అనే నానుడిని బలంగా నమ్ముతూ ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ దేశం పట్ల భక్తి భావంతో మెలుగుతూ అందరి సంక్షేమంలోనే నా సంక్షేమం ఉందని గుర్తిస్తూ పక్కవారిలో మంచి ఉంటే ప్రోత్సహిస్తూ మనలోని చెడు గుణాలను తొలగించుకుంటూ మంచి నడవడికతో క్రమశిక్షణతో అందరికీ ఆదర్శంగా అభిమాన వంతులుగా మార్చేసి అత్యున్నత స్థానంలో కూర్చోబెట్టి నీ భవితను తీర్చిదిద్ది చరిత్రలో నీ పేరు నిలిచేలా చేసేది చదువు మాత్రమే సూర్యోదయం కాకముందు ఎవరైతే నిద్ర లేచి చదువుకుంటారో, వారి కళ్ళల్లోని కాంతి ఈ ప్రపంచానికి కమ్ముకున్న కారు చీకట్లను తరిమి వెలుగులు నింపే సూర్యులవుతారు అని విట్యాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆవుల రవి తెలిపారు.

# వరంగల్ ప్రజల కలలు సాకారం అవుతున్నాయి

- ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలలో పాల్గొన్న ఎంపీ డా. కడియం కావ్య

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),డిసెంబర్7:** వరంగల్ ప్రజల ఎన్నో ఏళ్ల కలలు సాకారం అవుతున్నాయి అంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా పాలన.... సీఎం రేవంత్ రెడ్డి కృషి వల్లనే అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గారు అన్నారు. శనివారంహన్మకొండ సుబేదారి లోని ఆర్ట్స్ కళశాల అడిటోరియం మైదానంలో నిర్వహించిన ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాలలో భాగంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణలతో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. వరంగల్ నగరం అభివృద్ధిలో దూసుకుపోతుంది అంటే దానికి కారణం మన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని తెలిపారు. నగరంలో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి అవుతున్నాయి అంటే నాయిని రాజేందర్ రెడ్డి చొరవ వల్లనే. వరంగల్ నగర అభివృద్ధి విషయంలో రాజీ లేకుండా కృషి చేసే నాయకుడు దొరకడం మన అదృష్టం అని కొనియాడారు. నగర అభివృద్ధికి సహచర ఎమ్మెల్యేలను కలుపుకొని పోవడంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముందు ఉంటారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగర అభివృద్ధిపై పప్రత్యేక ద్రుష్టి పెట్టారని అందులో భాగంగానే వరంగల్ జిల్లా ప్రజల ఎన్నో ఏళ్ల కలలైన ఏయిర్ పోర్ట్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, టెక్స్ టైల్ పార్క్ అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజి అనేక అభివృద్ధి పనులు సాకారం అవుతున్నాయని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ నాగరాన్ని రాష్ట్ర రెండవ రాజధానిగా దృఢ సంకల్పంతో రూ. 5వేల కోట్ల నిధులను మంజూరు చేసారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి గారు చెప్పినవే కాకుండా చెప్పనివి కూడా అమలు చేసే దిశగా పని చేస్తున్నారని అన్నారు. రానున్న రోజులలో వరంగల్ నాగరాన్ని సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో మరింత అభివృద్ధి చేసుకుందామని దానికి వరంగల్ జిల్లా ప్రజల సహకారం ఉండాలని కోరారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.









# ఎమ్మెల్యేను కలుసుకున్న కొందుర్గు మండలం యువ నాయకుడు నరేందర్

- రంగారెడ్డి జిల్లా, యువజన కాంగ్రెస్ సెక్రటరీ గా నియమితులైన కొందుర్గు మండలం నరేందర్



**తొలి అక్షరం/షాద్ నగర్, డిసెంబర్07:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ కోందుర్గు మండలనికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు నరేందర్ కి రంగారెడ్డి జిల్లా, యువజన కాంగ్రెస్ సెక్రటరీ గా నియమితులై సందర్భంగా కొందూర్గు మండల నాయకులు, ప్రజలు కొనియాడారు.ఈ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొన్నారు. నరేందర్ ని అభినందిస్తూ శాలువాతోఎమ్మెల్యే సన్మానించారు. గెలుపొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తన గెలుపు కారణమైన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన జనరల్ సెక్రెటరీ అందె మోహన్,కాంగ్రెస్ కార్యకర్తలకు, నాయకులకు అందరికీ నరేందర్ ధన్యవాదాలు తెలిపారు.

# డోర్నకల్ ఎమ్మెల్యేని కలిసిన మండల యూత్ అధ్యక్షులు శ్రీకాంత్



**తొలి అక్షరం/నరసింహులపేట డిసెంబర్ 7:** మరిపెడ బంగ్లాలో ప్రభుత్వ విప్ జాటోత్ డాక్టర్ రామచంద్రనాయక్ మండల యూత్ ఎన్నికలలో గెలుపొందిన యూత్ అధ్యక్షులు పొన్నం శ్రీకాంత్ యూత్ విభాగం నాయకులు పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సన్మానించడం జరిగిందిఈ అవకాశం ఇచ్చినందుకు మండల ప్రజలకు నా యొక్క కృతజ్ఞతలు తెలిపారు ఆయన వెంట నిమ్మల సతీష్. యాదగిరి. శ్రీనివాస్. మండల నాయకులు తో పాటు తదితరులు పాల్గొన్నారు

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),డిసెంబర్7:** జఫర్గడ్ మండలం ఉప్పుగల్ గ్రామంలో 20 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జఫర్గడ్ మండలం మాచిరెడ్డిగూడెం గ్రామంలో అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 20 లక్షలతో జఫర్గడ్ మండలం తీగారం గ్రామంలో గ్రామ పంచాయతీ భవనానికి రూ. 18 లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. ముందుగా ఉప్పుగల్ గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రహదారులు బాగుంటేనే అభివృద్ధి సాధ్యమని, ప్రతి గ్రామానికి రహదారులు ఏర్పాటు చేయుటకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయముతో ఉందని మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి గారు స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ హాయంలో చేసిన రోడ్ల అభివృద్ధి శంకుస్థాపనలకే పరిమితమైపోయిందని విమర్శించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ రోడ్ల నిమిత్తం మరిన్ని నిధులు తీసుకొచ్చి..ఎక్కడ కూడా రోడ్ల ఇబ్బందులు లేకుండా సస్యశ్యామలం చేస్తానని అన్నారు. త్వరలో పేదలకు ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ఏడు లక్షల కోట్ల అప్పులకు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీలు కడుతూనే రైతులకు ఇచ్చిన హామీ మేరకు 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల పంటల మాఫీని చేసిందని అన్నారు. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 55 వేల మంది నిరుద్యోగులకు నియామక పత్రాలను అందజేసి అండగా నిలిచిందన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది ఒక్క చుక్కనీరు కూడా ఎత్తిపోయే లేదన్నారు. అయినప్పటికీ రికార్డు స్థాయిలో 66 లక్షల 70 వేల ఎకరాల వరి సాగు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కోటి యాభై లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రోత్సాహానికి ఇది నిదర్శనం అన్నారు. ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పండించిన సన్నాలకు క్వింటాకు 500 బోనస్ ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తోందని స్పష్టం చేశారు.

# నగరాభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు

**• సారథి నగర్ - మామిళ్ళగూడెం రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభించిన మంత్రి**





**తొలి అక్షరం/ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 7:** నగరాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ చేపడుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, నగర మేయర్ పునుకొల్లు నీరజ లతో కలిసి రూ. 190 లక్షల మునిసిపల్ నిధులతో ఆధునికీకరించిన సారథి నగర్– మామిళ్ళగూడెం రైల్వే అండర్ బ్రిడ్జి ప్రారంభోత్సవం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఉపయోగపడాలని తాను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడే రైల్వే అధికారులను కలిసి రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరు చేసుకున్నట్లు తెలిపారు. తర్వాతి ప్రభుత్వం లో ఉండగా నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేసుకున్నట్లు తెలిపారు. తిరిగి గత సంవత్సరం పనులు చేపట్టి, సంవత్సర కాలంలోనే పట్టుబట్టి, సమస్యలు పరిష్కరించి, పనులు పూర్తి చేసుకొని ఉపయోగంలోకి తెచ్చుకున్నామన్నారు. నగర ప్రజలే కాక, జిల్లా ప్రజలకు వెలుగుమట్ల పార్క్ ఒక మంచి సందర్శన స్థలంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టామని అన్నారు. నగరానికి దగ్గర్లో 500 ఎకరాల స్థలం దొరకడం జిల్లా ప్రజల అదృష్టమని తెలిపారు. ఖమ్మం ఖిల్లా ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికి రోప్ వే మంజూరు చేసుకున్నట్లు, ప్రతిరోజు ఖిల్లా నుండి పట్టణ ప్రాంతాన్ని సందర్శించే విధంగా కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.ప్రజలు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలంటే పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మంత్రి అన్నారు. కుటుంబ సభ్యులు ఏ జబ్బులకు గురికాకుండా ఉండాలంటే పరిశుభ్రంగా ఉంచాలని, దీనిపై మునిసిపల్ అధికారులు, సిబ్బంది ఇంకా శ్రద్ధ పెట్టాలని అన్నారు. ఖమ్మం పట్టణం ఇతర పట్టణాలకు ఆదర్శంగా నిలవాలని మంత్రి తెలిపారు.పట్టణీకరణ బాగా జరుగుతుందని, గ్రామీణ ప్రజలు బ్రతుకుదెరువు కోసం, వైద్యం, సౌకర్యాల కోసం పట్టణాలకు వస్తున్నారని, ప్రతి సంవత్సరం పట్టణ జనాభా పెరుగుతుందని మంత్రి తెలిపారు. మునిసిపల్ కార్పొరేషన్ బాధ్యతగా, భవిష్యత్ తరాలకు వీలుగా మాస్టర్ ప్లాన్ చేపట్టాలని, క్రమపద్ధతిలో పట్టణాల అభివృద్ధి చేపట్టాలని, లేకపోతే ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. ఇది అండర్ బ్రిడ్జి ప్రారంభం అయినా, ఎంతో అవస్థలు పడుతున్న ప్రజల అవసరాలు తీర్చడానికి పెట్టుకున్న కార్యక్రమం అని అన్నారు. నిజంగా అవసరం ఎక్కడ ఉందో గమనించి పెట్టుకున్న అద్భుతమైన ప్రక్రియ అని, ఇంకా అవసరాలు త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పోరేటర్లు కన్నం వైష్ణవి, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ కలిసిన నూతన డోర్నకల్ ప్రధాన కార్యదర్శి అనిల్



**తొలి అక్షరం/నరసింహులపేట డిసెంబర్ 7:** డోర్నకల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో విజయం సాధించిన నర్సింహులపేట మండలానికి చెందిన రేఖ అనిల్ కుమార్ యాదవ్ ను సన్మానిస్తున్న డోర్నకల్ నియోజకవర్గ శాసన సభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ ఈ అవకాశం ఇచ్చినందుకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలుపుతూ అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమేష్. మండల యూత్ అధ్యక్షులు శ్రీకాంత్. గ్రామ పార్టీ అధ్యక్షులు రామకృష్ణ. మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు దసురు. మండల ప్రధాన కార్య దర్శి రమేష్. దోమల యాదగిరి. గౌని యాదగిరి కాశయ్య. నాకు ఈఅవకాశంకల్పించిన ప్రతి మండల కార్యకర్తలకు ధన్యవాదాలు

# తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఒక నిరుపేద రైతు కూలీగా మార్చడాన్ని నిరసిస్తున్నాం

**• దేవతలకు కిరిటాలు బంగారాలు లేవా..మరి తెలంగాణ తల్లికి ఎందుకు వద్దు • మార్పు మార్పు అంటే ముద్రలు మార్పు, విగ్రహాల మార్పు, చారిత్రక కట్టడాల మార్పు...ఇదేనా రేవంత్ రెడ్డి • తెలంగాణ తల్లికి మెట్టెలు పెట్టిన పుస్తే ఎక్కడ పోయింది • మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వర ప్రసాద్ రావు**




**తొలి అక్షరం/షాద్ నగర్, డిసెంబర్07:** మార్పు మార్పు అంటూ ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాల్సింది పోయి ప్రభుత్వ చిహ్నాలు మార్చడం, రాచరికపు భవనాల ఆనవాళ్లు లేకుండా చేయడం, చివరకు తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం, అది కూడా నిరుపేద మహిళా రైతు వ్యవసాయ పొలంలోకి వెళుతున్నట్లు ఉన్న విగ్రహాన్ని రూపొందించడం నీకే చెల్లిందని, ఏం తెలంగాణ తల్లికి కిరీటము, బంగారు నగలు, నడుముకు వడ్డాణం, పట్టుచీర ఉండవద్దా, నీ భార్య పిల్లలు ఒంటి మీద సొమ్ములు లేకుండానే తిరుగుతున్నారా అంటూ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజ వరప్రసాద్ తీవ్రంగా ప్రశ్నించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ అన్నట్టు తెలంగాణ తల్లి విగ్రహాన్ని బిఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేయలేదని 70, 80 సంవత్సరాల నుండి కవులు కళాకారులు మేధావులు తమ అద్భుతమైన ఆలోచనలతో ప్రజలు రూపొందించుకున్న విగ్రహమే తెలంగాణ తల్లి విగ్రహం కానీ బిఆరెస్ పార్టీ తయారు చేసిన విగ్రహం కాదని తెలిపారు. ముస్లిం సోదరులందరి నానుడి ప్రకారం మాకే పైరొంకే నిచ్చే జన్నత్ హై, అంటే తల్లి పాదాల కింద స్వర్గం ఉన్నట్టు నీకు తెలియదా, దైవం కంటే కూడా తల్లి గొప్పదన్న విషయం మరచి నీకు అనుకూలంగా వున్న మీడియాతో అసత్య ప్రచారం చేస్తూ దేవత లాంటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని, తెలంగాణ అస్తిత్వాన్ని మార్చే ప్రయత్నం వెనుక పెద్ద రాజకీయ కుట్ర కోణం ఉందంటూ ప్రభుత్వాన్ని విమర్శించారు. తెలంగాణ తల్లికి మెట్టెలు పెట్టినవ్, మరి పుస్తె ఎవడు మాయం చేసిండంటూ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కొత్త రాష్ట్రానికి అవసరమైన అన్ని రకాల వసతులు సదుపాయాలు, ప్రభుత్వ ముద్రలు, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసుకోవడానికి అవసరమున్న ఆ సందర్భంలో అప్పటి ప్రభుత్వం వాటన్నింటినీ ఏర్పాటు చేసింది కానీ, మీలాగా కేసీఆర్ మీద కక్షతో ఆయన ఏర్పాటు చేసిన ఆనవాళ్లను తుడిచేస్తాననడం, మీకు దమ్ముంటే రాష్ట్ర పక్షి పాలపిట్టను, రాష్ట్ర వృక్షం జమ్మి చెట్టును మార్చండి చూస్తామంటూ హెచ్చరించారు. భరతమాత కిరీటం లేదా, ఇందిరాగాంధీ హయాంలో భరతమాతకు గుడి కట్టలేదా, పక్కనే కర్ణాటకలో కన్నడ మాతాకు నగలు నటుడు లేవా, తమిళనాడులోని తమిళ తాయి కి దేవత స్వరూపం లేదా, అన్ని రాష్ట్రాల వారికి అన్నీ ఉన్నప్పుడు మరి మన తెలంగాణ తల్లికి కిరీటము నగలు వడ్డాణము పట్టుచీర ఎందుకు ఉండొద్దు అంటూ ప్రశ్నించారు. 1953లో అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగంతో ఏర్పడ్డ ఆంధ్ర రాష్ట్రానికి ఏర్పాటయిన తెలుగుతల్లి విగ్రహం ఉమ్మడి రాష్ట్రం తో పాటు ప్రస్తుతం అలాగే అధికారిక చిహ్నంగా కొనసాగడం లేదా అని ప్రశ్నించారు. గత పదేళ్ల కాలం పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టినప్పుడు, తెలంగాణ చిహ్నామైన తెలంగాణ తల్లి విగ్రహం కడు నిరుపేద రైతు గానే మిగిలిపోవాల్నా అంటూ ఎద్దేవా చేశారు. అంతెందుకు నీ ప్రభుత్వం ఏర్పడ్డాక మహాలక్ష్మి పథకం ఏర్పాటు చేస్తున్నావ్ కదా మరి మహాలక్ష్మి దేవత కాదా, ఆమెకు కిరీటం ఉండదా అంటూ రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి కొత్త విగ్రహాన్ని, రేవంత్ రెడ్డి కోతి చేష్టల్ని తెలంగాణ సమాజం గ్రహిస్తుందని, గమనిస్తుందంటూ రేవంత్ రెడ్డికి భయపడి నోరులు మూసుకున్న మేధావులు దీనికి సమాధానం చెప్పాలని ఆయన మేధావులను కోరారు. ఏ మతంలోనైనా తల్లి అందరికీ దేవత లాంటిదని అలాంటి తల్లి స్థానాన్ని కించపరచకుండా కాంగ్రెస్ నాయకులు నడుచుకోవాలని, అంతెందుకు మేరీమాత విగ్రహానికి కూడా కిరీటం లేదా అని ప్రశ్నించారు. కంచు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ తెలంగాణ తల్లిని నాలుగు గోడల మధ్య బంధించడం భావ్యం కాదని, అది ఎప్పటికైనా తుప్పు పడుతుందని, ఈనెల 9వ తేదీన జరిగే నూతన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు నిరసనలు తెలుపుతూ పాలాభిషేకం చేస్తామని ఈ సందర్భంగా రాజ వరప్రసాద్ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఆయనతోపాటు బీఆరెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే డా.రాంచంద్ర నాయక్‌ని కలిసిన కొర్ని సురేష్



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),డిసెంబర్7:** తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికలలో డోర్నకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గా కొర్ని సురేష్ శనివారం మరిపెడ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డా.రాంచంద్ర నాయక్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే నియోజకవర్గ యువజన ఉపాధ్యక్షులు కొర్ని సురేష్ ను అభినందింస్తూ,మీరు నియోజకవర్గం మండల గ్రామాల సమస్యల తోడ్పడుతూ, యువకులను చైతన్యవం తులుగా చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మహబూ బాబాద్ జిల్లా యూవజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జరుపుల విజయ్,డోర్నకల్ నియోజకవర్గం యూవజన కాంగ్రెస్ అధ్యక్షులు చాగంటి సందీప్,వివిధ మండల ఉపాధ్యక్షులు జనరల్ సెక్రటరీలు,యూత్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువకులకు క్రీడా స్ఫూర్తి కలిగించే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం

**• యువత క్రీడా నైపుణ్యాన్ని పెంచుకుంటూ...క్రీడల్లో రాణించాలి • దేశంలోనే మొదటిసారిగా గెలిచిన క్రీడాకారులకు ట్రోఫీతోపాటు,2.5 లక్షల నగదు బహుమతి అందజేత • పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా**





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),డిసెంబర్7:** యువకులకు క్రీడా స్ఫూర్తి, ప్రోత్సహంగా ఉండే ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అని పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు.శనివారం వరంగల్ టెన్నిస్ అసోసియేషన్ వరంగల్ క్లబ్ సహకారముతో నిర్వహించిన జాతీయ పురుషుల ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ 8 రోజుల క్రీడోత్సవం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా విజేతలు నీరవ్ శెట్టి,అనూప్ బంగాగి,ఇంగలే ప్రసాద్ లకు బహుమతులను ప్రదానం చేశారు.ఈ సంద్భంగా పోలీస్ కమీ షనర్ అంబర్ కమాట్లాడుతూ....ఈ కార్యక్రమం విజయవంతం అవ్వడానికి సహకారాన్ని అందించిన వరంగల్ బాడ్మింటన్ అధ్య క్షుడు డాక్టర్ రమేష్ కుమార్,వారి కార్యవర్గానికి,జాతీయ ఎఫ్ఎల్డిఐ అధ్యక్షులు పింగళి వెంకటేశ్వర రావు లకు, యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. తల్లి తండ్రులు పిల్లలకు చదవుతో పాటు క్రీడలపై ఆసక్తి పెరిగేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. యువత క్రీడా నైపుణ్యాన్ని పెంచుకుంటూ,క్రీడల్లో రాణించి దేశ ఔన్నత్యానికి పాటుపడాలని ఆయన అన్నారు.క్రీడలు స్నేహాభావని పెంపొందించి,శారీరక మానసిక ఆరోగ్యానికి అవసరమన్నారు. అనంతరం జాతీయ ఎఫ్ఎల్డిఐ అధ్యక్షులు పింగళి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ...దేశ వివిధ ప్రాంతాల నుండి వచ్చిన క్రీడాకారులు వారి అద్భుత ప్రదర్శన ప్రజలను ముగ్దులను చేసిందని జాతీయ ఎఫ్ఎల్డిఐ అధ్యక్షులు పింగళి వెంకటేశ్వర రావు తెలిపారు. గెలిచిన క్రీడాకారులకు ట్రోఫీతోపాటు,2.5 లక్షల నగదు పురస్కారమివ్వడం దేశములో మొట్టమొదటి సారి జరిగిన పరిణామం అని పీవీ రావు అన్నారు.ఈ కార్యక్రమాన్ని చేపట్టిన వరంగల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు గంద్ర సత్యనారాయణ రెడ్డి,వారి కార్యవర్గ సభ్యులను అభినందించారు.ఉభయ వరంగల్ ప్రజలకు గర్వ కారణమని తెలిపారు. యువకులకు క్రీడా స్ఫూర్తి, ప్రోత్సహంగా ఉండే ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అని వారన్నారు. సహకరించిన మోంటేసరి స్కూల్ యాజమయానికి, వరంగల్ క్లబ్ కార్యవర్గానికి కృత్ఞతలు తెలిపారు. ఇంతటి గొప్ప కార్యక్రమం విజవంతమవడానికి కారకులైన సెక్రటరీ యన్ మనోహర్ రెడ్డి,కోశాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు ఈలమురుగు,జి.రాజేశ్వర్ రావు, జాయింట్ సెక్రటరీ కన్నా రెడ్డి,వరంగల్ క్లబ్ సెక్రటరీ రవీందర్ రెడ్డి,కార్యవర్గ సభ్యులు గోపాల్ రావు ల కార్యదీక్షకు హర్షాన్ని వ్యక్త పరుస్తూ...అహర్నిశలు కష్టించిన ప్రభాకర రావు,ఈలమురుగుల కఠోరదీక్షను కొనియా డుతూ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.కన్నా రెడ్డి వందన సమర్పణ చేస్తూ పాల్గొన్న ప్రతి ఒక్క క్రీడాకారుడు ఆచరించిన విధానాలు, అద్భుత ప్రదర్శన,వరంగల్ క్లబ్ సిబ్బంది చేసిన సహక రించిన పద్దతి, ముఖ్యముగా వరంగల్ గౌరవ మెంబ ర్లకు, ఏఐటి ఏకు ప్రాతినిధ్యం వహించి ఎటువంటి ఇబ్బంది లేకుం డా నిర్వహి ంచిన శివకుమార్ కు, సహకరించిన ప్రతి ఒక్కరికి కృత్ఞ తలు తెలు పుతూవరంగల్లో టెన్నిస్ సంబరాలు విజయవంతంగా ముగిశాయి.



## విప్ర బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో ఎంపీ డా. కడియం కావ్య

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),డిసెంబర్7:** గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంటలో నిర్మించిన విప్ర బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

